## క్లుప్తంగా

### నేడు గద్దర్ సంతాప సభ

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా గాయకుడు గద్దర్ సంతాప సభను ఆదివారం ఉదయం 10.00 గంటలకు కడపలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కన్వీనర్ సంగటి మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. గద్దర్ మరణం పేద వర్గాలకు తీరని లోటన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

వైవీయూ : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, తాజాగా చంద్రయాన్–3 విజయవంతంలో సైతం మహిళా శాస్త్రవేత్తల పాత్ర ఎంతో ఉందని వైవీయూ వాణిజ్యశాస్త్రశాఖ విభాగాధిపతి ఆచార్య జి.విజయభారతి పేర్కొన్నారు. శనివారం శ్రీహరి డిగ్రీ కళాశాలలో మహిళల సమానత్వ దినోత్సవం నిర్వహించారు. విజయభారతి మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులు శ్రమించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ జి. సుబ్బారెడ్డి మాట్లాడారు. ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అవకాశం

కడప కార్పొరేషన్ : ఆదివారం సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక అధికారి ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు.

### పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 528 మంది గ్రేడ్ 1 నుంచి 5 వరకూ గల పంచాయితీ కార్యదర్శులకు జిల్లా పంచాయితీ వనరుల కేంద్రం(డీపీఆర్‌సీ)లో ఆరు రోజుల వసతితో కూడిన శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 29వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకూ 5 బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఉంటుందన్నారు. లే అవుట్ల ఏర్పాటు, జగనన్న శాశ్వత భూ హక్కు అమలుపై ఒకరోజు ఫీల్డు విజిట్ ఉంటుందని, ఏపీ పంచాయితీ రాజ్ చట్టం, ఉద్యోగుల విధి నిర్వహణ–క్రమశిక్షణ చర్యలు, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు.

### అర్హులు ఓటుహక్కు పొందాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటుహక్కు నమోదు నమోదు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, కడప పార్లమెంటు కన్వీనర్ బాలకృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఓటర్ చేతన్ మహా అభియాన్‌లో భాగంగా రెండవరోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సూర్యరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు చలపతి తదితరులు పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని దిశ పోలీసు స్టేషన్ ఎస్ఐ నస్రీన్ తెలిపారు. శనివారం నగరంలోని అల్మాస్‌పేటలోగల ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, సింక్రోసర్ గ్లోబల్ సొల్యూషన్ సంస్థలో జాతీయ నైపుణాభివృద్ధి సంస్థ శిక్షణా కేంద్రం ఇన్‌ఛార్జి మేనేజర్ ఎస్‌కే అంజుమ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న మహిళా అభ్యర్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూ జీకేవై పథకం ద్వారా సీ–డ్యాప్ సౌజన్యంతో ఉన్నతీ స్కీమ్‌లో భాగంగా ఉపాధి పథకంలో వంద దినాలు పూర్తయిన కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజినల్ కో ఆర్డినేటర్ ఎస్.సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల కాల వ్యవధిలో ఉచితంగా కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు 90630 82227 నెంబరులో సంప్రదించాలన్నారు.

### ఘనంగా వార్షికోత్సవం

కడప కార్పొరేషన్ : రక్షణ స్వచ్ఛంద సంస్థ 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక ఎస్‌పీజీ చర్చి ఎదురుగా ఉన్న మదర్ థెరీసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ ఆవరణంలో ఉన్న ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో కేక్ కట్ చేసి, సమాజానికి సేవలందించిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలకు ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, రోటరీ క్లబ్ చైర్మెన్ సమరనాథరెడ్డిలు హాజరయ్యారు. అనంతరం కానిస్టేబుల్ అయ్యవారయ్య, వైఎస్సార్‌టీయూసీ నగర అధ్యక్షుడు నాగరాజు, మదర్ థెరీసా వికలాంగుల సేవా సంఘం అధ్యక్షుడు ప్రసన్న కుమార్‌ను సత్కరించారు.

# ప్రగతి పథంలో కడప

- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- రూ.2కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభం


చెమ్ముమియ్యాపేటలో ఏర్పాటు చేసిన పార్కును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : దేశంలో ఎన్నడు జరగలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అభివద్ధి జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి అంజద్‌బాషా పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సాధారణ నిధుల నుంచి స్థానిక చెమ్ముమియ్యాపేటలో బ్రిడ్జి కింద రూ.1.60కోట్ల వ్యయంతో పార్కు, ఐటీఐ సర్కిల్ వద్ద 13.35లక్షలతో గాంధీ పార్కు, బాలాజీ నగర్ లో రూ.20.42లక్షలతో హిందూ శ్మశానవాటికల అభివద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి ఎస్ బి అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డిలు ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ చెమ్ముమియా పేట ప్రాంతంలో సుమారు 2 కోట్ల వ్యయంతో ఒక పార్కును ప్రారంభోత్సవం చేయడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా 44వ డివిజన్ పరిధిలో గాంధీ విగ్రహం వద్ద రూ.13.35 లక్షల వ్యయంతో గాంధీ పార్కును ప్రజల కోసం తీర్చిదిద్దామన్నారు. ప్రజలందరూ ఈ పార్కులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఒక్క కడప నగరంలోనే సుమారు రూ. 2000 కోట్ల రూపాయలతో అభివద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి రిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేశారని, ఆయన తనయుడైన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రిమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా మార్చారన్నారు.మరో మూడు ఆస్పత్రులను ఏర్పాటు చేసి డిసెంబర్ లోగా పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, 45వ డివిజన్ ఇన్‌చార్జి జి. శ్రీనివాసులరెడ్డి, 44వ డివిజన్ కార్పొరేటర్ హేమలత, డివిజన్ ఇన్‌చార్జి రామక్రిష్ణారెడ్డి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ పాకా సురేష్ కుమార్, షఫీ, బండి ప్రసాద్, తోటక్రిష్ణ, జమాల్‌వలీ, కె.సూర్యనారయాణరావు, నగరపాలక ఎస్ఈ రత్నాల రాజు, డీఈ అబిద్ హుస్సేన్, ఏఈ దిల్షాద్ పాల్గొన్నారు.

## బస్సు యాత్రను జయప్రదం చేయండి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేశాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో సీపీఐ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్రలో భాగంగా ఈ నెల 30, 31న జిల్లాలో జరిగే యాత్రను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంట వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాగ్దానాలు అమలు చేయకపోగా రైతుల, కార్మికుల, మహిళల, విద్యార్థి, యువజనుల హక్కులను హరించే రీతిలో దుష్ట చట్టాలు చేస్తోందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు శ్రీరాములు, మద్దిలేటి, జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా ఏఎఫ్‌యూ

వైవీయూ : ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఆదర్శంగా నిలవాలని వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వైస్ ఛాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్ ఆకాంక్షించారు. శనివారం విశ్వవిద్యాలయంలో యాంటీ ర్యాగింగ్ పోస్టర్లను రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేకుండా విద్యార్థులందరూ స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ సంస్కృతికి దూరంగా ఉంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు.


నో ర్యాగింగ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతరం యాంటీ ర్యాగింగ్ పోస్టర్ డిజైన్, లోగో డిజైన్, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నతరహా పరిశ్రమలతో ఆదాయ వనరులు

వైవీయూ : పుట్టగొడుగుల పెంపకం వంటి గ్రామీణ చిన్నతరహా పరిశ్రమలతో ఆదాయ వనరులను సమకూర్చుకోవచ్చని వైవీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. శనివారం విశ్వవిద్యాలయంలోని మష్రూమ్ కల్టివేషన్ సెంటర్, బయోటెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో పుట్టగొడుగల పెంపకంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా ప్రణాళికలు ఉండాలన్నారు. మష్రూమ్ కల్టివేషన్ సెంటర్ సమన్వయకర్త ఆచార్య చంద్రమతీశంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన పుట్టగొడుగులకు మంచి డిమాండ్ ఉందన్నారు. బయోటెక్నాలజీ శాఖ


విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

ఆచార్యులు డా. ఎ. చంద్రశేఖర్ మాట్లాడారు. అనంతరం ఇంటర్న్‌షిప్‌కు విచ్చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

## పంటల సాగులో సూచనలు అందించాలి

కడప అగ్రికల్చర్ : పంటల సాగులో రైతులకు ఏడీఏలు అండగా ఉంటూ తగిన సలహాలు, సూచనలను ఇవ్వాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్ ఆచారి అన్నారు. శనివారం కడప నగర శివార్లలోని ఊటుకూరు పరిశోధన కేంద్రంలో ఉమ్మడి జిల్లా లోని ఏడీఏలకు శిక్షణ తోపాటు వర్షభావ పరిస్థితులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు జిల్లాల్లో కూడా సరైన వర్షం పాతం లేకపోవడంతో పంటలసాగు విస్తీర్ణం తగ్గిందని అన్నారు. సాగు చేసిన పంటలు కూడా వర్షాభావం వల్ల ఎండిపోతున్నట్లు తెలిపారు. సెప్టెంబర్‌లోపు వర్షాలు పడితే సాగు చేయాల్సిన


మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్

ప్రత్యామ్నాయ పంటలపై ఆయనతోపాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్, ఆత్మపీడీ విజయలక్ష్మి, ఏరువాక కేంద్ర సమన్వయకర్త మురళీకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు సునిల్‌కుమార్, శ్రీవల్లి, శిల్పకళ, బాగమతిప్రియ, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు జీవనోపాధులు పెంపొందించుకోవాలి

కడప కార్పొరేషన్ : స్వయం సహాయ సంఘాల మహిళలు జీవనోపాధులను పెంపొందించుకోవాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వై. సురేష్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక అక్కాయపల్లె సమావేశ మందిరంలో పడమట పట్టణ మహిళా సమాఖ్య నెలవారీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పీడీ మాట్లాడుతూ సంఘాల బలోపేతం, పుస్తకాల నిర్వహణపై అవగాహన కల్పించారు. జగనన్న తోడును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి, ఎల్ఎస్ నాగరాజు, ఐబీ ఎఫ్రాయిమ్, బ్యాంక్ లింకేజ్ కో ఆర్డినేటర్ గోపీనాథ్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి వల్లూరు మోడల్ స్కూల్ ప్రాజెక్టు ఎంపిక

కడప ఎడ్యుకేషన్: యూనిసెఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ ఇన్నోవేషన్ పోగ్రాం నిర్వహించగా ఇందులో 2326 పాఠశాలలకు చెందిన 64,583 మంది విద్యార్థులు పాల్గొన్నారని జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. ఇందులో 3238 మంది తమ కొత్త ఆలోచనలతో ఇన్నోవేషన్ పోగ్రాంలో పాల్గొన్నారని తెలిపారు. వివిధ స్థాయిల్లో పరిశీలించి ఇందులో 27 మంది విద్యార్థులు తయారు చేసి 19 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారని తెలిపారు. ఎంపిక చేసిన 19 ప్రాజెక్టుల్లో వైఎస్సార్‌జిల్లా వల్లూరు మోడల్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు కూడా ఉందన్నారు. ఈ పాఠశాలకు చెందిన గాయత్రి టీచర్ శ్వేత, నందిని, జీవన, మేఘన, సాక్షిలతో చేయించిన సెల్ఫ్ డ్రిల్ ఫామింగ్ అగ్రికల్చర్ అనే ఐడియాను అప్‌లోడ్ చేశారన్నారు. ఈ ఐడియాను పరిశీలించిన పరిశీలకులు వీరి నమూనాను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారాన్నరు. రాష్ట్రస్థాయికి ఎంపికైన 19 ప్రాజెక్టుల విద్యార్థులకు, వారి గైడ్ టీచర్లకు విజయవాడలో శాస్త్రవేత్తలతో బూట్ క్యాంపును ఈ నెల 28,29 తేదీల్లో నిర్వహిస్తారని తెలిపారు. వీరికి ఈనెల 30వ తేదీన రాష్ట్రస్థాయి పోటీ ఉంటుందని తెలిపారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులతో విద్యార్థులు

### మదర్ థెరీసాకు ఘన నివాళి

కడప సెవెన్‌రోడ్స్ : సేవామూర్తి మదర్ థెరీసా అని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కొనియాడారు. శనివారం పాత కలెక్టరేట్ ఎదుట ఉన్న ఆ సంఘ కార్యాలయంలో భారతరత్న మదర్ థెరీసా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, కోశాధికారి నగేష్, నాయకులు పాల్గొన్నారు.

### నేడు రాఖీ ఉత్సవం

కడప కల్చరల్ : స్థానిక ఓం శాంతినగర్‌లోని బ్రహ్మకుమారీ సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11.30 గంటలకు రాఖీ, శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు వేడుకలను నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి బీకే అన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక సబ్ జోనల్ ఇన్‌ఛార్జి బెంగుళూరుకు చెందిన బీకే లీలాదీది ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు.

### పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

వైవీయూ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో 'పునీత్ సాగర్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని కృష్ణ కాలువ పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్. నీలయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను నీటిలో వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డా. మహేష్, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

### రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కడప అర్బన్ : కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఎస్ఐ మధుసూదన్ రెడ్డి శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మంచి నడవడికతో జీవించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### న్యాయవిజ్ఞాన సదస్సు

కడప అర్బన్ : సమాజంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్స్‌ను బాధ్యతగా చూసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎం ప్రదీప్‌కుమార్ తెలియజేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కడప నగర శివార్లలోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14567కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.


వృద్ధాశ్రమంలో మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

- చిన్నచౌక్‌లో వున్న ఆంధ్రప్రదేశ్ బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల/ కళాశాలను జడ్జి ప్రదీప్‌కుమార్ సందర్శించారు. పిల్లలు అందుతున్న సదుపాయాలను తెలుసుకున్నారు.
- నల్సా (అసంఘటిత రంగంలోని కార్మికులకు న్యాయసేవలు పథకం 2015)పై జిల్లా అధికారులతో జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ కడపలోని న్యాయసేవాసదన్‌లో సమావేశమై అవగాహన కల్పించారు.
- సెప్టెంబర్ 9న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవాసదన్‌లో అధికారులతో, సిబ్బందితో సమీక్ష చేపట్టారు. ఇన్‌ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గీత, డిఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ప్రదీప్‌కుమార్‌లు సమీక్ష నిర్వహించారు.

### ఓటర్ల తొలగింపుపై పునః పరిశీలన

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఓటర్ల తొలగింపుపై పునః పరిశీలన కొనసాగుతోంది. జాబితాల నుంచి పెద్ద సంఖ్యలో పేర్లు గల్లంతైనట్లు అందిన సమాచారం మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి విచారణ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక అధికారిగా జిల్లా సహకారశాఖ అధికారి (డీసీఓ) సుభాషిణిని నియమించారు. ర్యాండమ్‌గా 500 మంది ఓటర్లను తీసుకుని పరిశీలన చేస్తారు. ఎక్కడైనా అనుమానం వస్తే క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహిస్తారు. గత ఏడాది జనవరి 6 నుంచి ఈనెల 14 వరకు జరిగిన ఓటర్ల తొలగింపుపై ఈ పునః పరిశీలన చేస్తున్నారు. ఈనెల 31వ తేదీ నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించనున్నారు. జిల్లాలో 94,857 ఓట్లు జాబితా నుంచి తొలగించారు. తొలగించిన మొత్తం ఓట్లలో ఫోటో సిమిలర్ ఎంట్రీలు, డెమోగ్రాఫిక్ సెమిలర్ ఎంట్రీలు 17,240 ఉన్నట్లు సమాచారం.

## ఆలయాలలో శ్రావణ సందడి

కడప కల్చరల్ : శ్రావణమాసం రెండవ శనివారాన్ని పురస్కరించుకుని భక్తులు సమీప ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించి మొక్కుకున్నారు. కడప నగరంలో శనివారం తెల్లవారుజాము సమయానికే ఆలయాల్లోని మూలమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించి అలంకారం చేసి భక్తులను దర్శనాలకు అనుమతించారు. కడప నగరంలో దాదాపు అన్ని వైష్ణవాలయాలతోపాటు ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.

- దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. పాత బస్టాండులోని గాలి దేవర ఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి ఆకుపూజ, వడమాల సేవ తదితర పూజలు నిర్వహించారు. చిన్నచౌకు ఆంజనేయస్వామి ఆలయంలో మూలవర్లకు విశేష అలంకారం చేశారు. శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయ స్వామికి వడమాల సేవ చేశారు.
- పాలకొండల్లోని శ్రీ పాలకొండ్రాయస్వామిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు క్యూలో వేచి ఉన్నారు. ఇందిరానగర్‌కు చెందిన బాలాజీ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఏటూరి రామచంద్రారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పాలకొండల్లో అన్నదానం చేశారు.


విశేష అలంకారంలో శ్రీ పాలకొండ్రాయస్వామి


వడమాల సేవలో శ్రీ వీరాంజనేయస్వామి

## ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాల క్యాలండర్ ద్వారా ప్రతి గడపకు సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. శనివారం నగరంలోని 47వ డివిజన్‌లోని అక్కాయపల్లి నబీకోట చౌడమ్మ గుడి ప్రాంతంలోని వీధులలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి.. ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో నేరుగా మాట్లాడారు. పథకాల లబ్ధి సమాచారంతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్నవారు ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎం. లక్ష్మీ దేవి అనే మహిళ మాట్లాడుతూ తనకు వైఎస్ఆర్ ఆసరా, ఈబీసీ నేస్తం, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, వైఎస్ఆర్ పింఛన్ కానుక, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ. 9,79, 374 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వంలో మాకు అందలేదని ఇలాంటి ముఖ్యమంత్రికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 47 వ డివిజన్ కార్పొరేటర్ పాక సురేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, మియ్యా, షఫీ, డా. సొహైల్, అల్లాబక్ష్, ఉమైర్, జమాల్‌వలీ, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, పస్తం అంజి, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, మూలే సరస్వతి, నారాయణమ్మ, రామలక్ష్మి, తులశమ్మ, సుశీలమ్మ పాల్గొన్నారు.


'గడప గడపకు మన ప్రభుత్వం'లో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

### రాష్ట్ర ఉర్దు అకాడమీ ట్రైనింగ్ సెంటర్, లైబ్రరీ ఆకస్మిక తనిఖీ

తొలుత ఆయన ఆంధ్ర రాష్ట్ర ఉర్దు అకాడమీ ట్రైనింగ్ సెంటర్, లైబ్రరీలను తనిఖీ చేశారు. ఎక్కువ మంది సెంటర్‌ను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఉర్దు అకాడమీ ట్రైనింగ్ సెంటర్, లైబ్రరీ డైరెక్టర్ ఆయుబ్ హుస్సేన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అర్చకులు మచ్చా శేషాచార్యులు కన్నుమూత



కడప కల్చరల్ : ప్రధాన అర్చకుడు మచ్చా శేషాచార్యులు(65) శనివారం కన్నుమూశారు. ఈయన గత 45 ఏళ్లుగా కడప నగరంలోని ఆధ్యాత్మిక క్షేత్రం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్నారు. నిత్య పూజల్లో భాగంగా శనివారం తన సొంత ఖర్చుతో స్వామికి పుష్పాలంకరణ చేయించారు. కొద్దిసేపట్లో దర్శనానికి వెళ్లాల్సి ఉండగా, మరో పూజ చేసేందుకు సన్నిహితులు పిలువడంతో కల్యాణమండపంలోకి వెళ్లారు. పూజ ప్రారంభించిన వెంటనే అక్కడే ఆయన కుప్ప కూలిపోయారు. ప్రమాదం నుంచి తప్పించేందుకు సపర్యలు చేసి ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయారు.

- మార్కాపురానికి చెందిన మచ్చా శేషాచార్యులు బాల్యంలో తిరుపతి వేద పాఠశాలలో చదువుకున్నారు. తిరుచానూరులోని ఆలయ అర్చకులు ఆయన సమీప బంధువు కావడంతో అక్కడే కొద్ది కాలం సేవలదించారు. అనంతరం ఆయనకు పిల్లలు లేకపోవడంతో శేషాచార్యులుకు తన మిరాశిగా హక్కులు కల్పించారు. అప్పటినుంచి ఆయన కడపలోని దేవుని కడప ఆలయంలో అర్చకులుగా సేవలందిస్తున్నారు. 1999లో ఆయన మిరాశి నుంచి దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చారు. నాటి నుంచి దేవుని కడప ఆలయంలో ప్రధాన అర్చకులుగా సేవలందిస్తున్నారు. ఆయన కుమారుడు సాయికృష్ణ ప్రస్తుతం దేవుని కడప ఆలయంలో ఒప్పంద ప్రాతిపదికన అర్చక సహాయకుడిగా పనిచేస్తున్నారు. శేషాచార్యులు జీవితాంతం స్వామి సన్నిధిలో పనిచేశారు. తమకు పెద్ద దిక్కుగా ఉన్న శేషాచార్యులు మరణించడం తీరని లోటని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం అంజాద్‌బాష ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆదివారం అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు.